# అందుబాటులో ఉండి సేవలందించండి

- నార్సింగి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్
- 2024-25 అంచనా వ్యయం బడ్జెట్ రూ.192కోట్లు

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానిస్తున్న ప్రజాప్రతినిధులు

మణికొండ, ఫిబ్రవరి 9: ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిధులను సక్రమంగా వినియోగించేందుకు చొరవచూపాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మున్సిపాలిటీలో ప్రవేశపెట్టిన రూ.192 కోట్ల అంచనా వ్యయ నిధుల వెచ్చింపులపై ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతను బట్టి నిధులను వెచ్చించేందుకు ప్రజాప్రతినిధులు చొరవచూపాలని సూచించారు. నగర శివారు ప్రాంతంలోని మున్సిపాలిటీలల్లో అత్యధికంగా నిధులు ఉండటంతో ఈ ప్రాంతాలు నగరానికి దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఈ సందర్భంగా బడ్జెట్ వివరాలను మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి సమావేశంలో వెల్లడించారు. 2024-25 ఏడాదికి గాను మున్సిపాలిటీ పన్ను ఆదాయం రూ.3522.09లక్షలు, అద్దె/పెనాల్టీ ఆదాయం రూ.327.25లక్షలు, టౌన్‌ప్లానింగ్ ఆదాయం రూ.4700.00 లక్షలు, ట్రేడ్ లైసెన్సు/పెనాల్టీల ఆదాయం రూ.327.25 లక్షలు, ఇంజనీరింగ్ విభాగం ఆదాయం రూ.10.80లక్షలు, డిపాజిట్లు రూ.470.00 లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంట్లు రూ.180.00లక్షలు, ప్లాన్‌గ్రాంట్ రూ.05.00లక్షలు, ఇతర గ్రాంట్లు రూ.40.00 లక్షలు, మొత్తం ప్రారంభపు విలువ రూ.9363.26 లక్షలుగా ఉన్నట్లు తెలిపారు. 2024-25 ఏడాది గాను మున్సిపాలిటీ నుంచి రూ.19201.40లక్షలు (అక్షరాల నూట తొంబై రెండు కోట్ల ఒక లక్ష నలబై వేలు) బడ్జెట్‌ను అంచనా వ్యయంగా టార్గెట్ పెట్టుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, డీఈ నర్సింహారాజు, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ యోగేశ్ నాయక్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమణలను తొలగించండి

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గగన్‌పహాడ్ మామిడికుంట, అప్ప చెరువులను రాజేంద్రనగర్ ఆర్డీవో మల్లయ్య, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఇరిగేషన్ అధికారి నారాయణ, ఈఈ నరేందర్, డీఈ విశ్వంతో కలిసి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి శుక్రవారం చెరువులను సందర్శించి పరిశీలించారు. చెరువులలో వెలుస్తున్న ఆక్రమణలు, మట్టి కుప్పలను తొలగించాలని, చెరువు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని అధికారులకు ఆదేశించారు.

*– మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9*

## ఎన్ఐఏ దాడులు అప్రజాస్వామికం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: సమాజంలోని పౌర హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్ట్‌ల ఇండ్లపై ఎన్ఐఏ దాడులు చేయడం అప్రజాస్వామిక మని పలువురు వక్తలు అన్నారు. ఎన్ఐఏ అధికారులు ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తూ హక్కులకు భంగం కలిగిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యం కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావుతో కలిసి సీనియర్ జర్నలిస్ట్, వీక్షణం మాస పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, నార్ల రవి మాట్లాడారు. వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమిత్‌షా పోలీసుల పాలన నడుస్తుందని, ఎలాంటి ఆధారాలు లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏతో దాడులు చేయిస్తుందని ఆరోపించారు.

## కేంద్రం తెచ్చిన వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: దేశంలోని రవాణా రంగ కార్మికులను దోచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో తీసుకువచ్చిన మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16న ఆటోలు, క్యాబ్‌లు, లారీలను బంద్ చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ జేఏసీ నేతలు బి.వెంకటేశం, వేముల మారయ్య, షేక్ సలావుద్దీన్, రాజేందర్‌రెడ్డిలు తెలిపారు. ఆ బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగింది. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

## శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

శంషాబాద్ మున్సిపల్ పాలకవర్గంతో చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 9: శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తున్నదని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్‌లు తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని మల్లికా కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ సాధారణ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు. నాలుగేండ్లుగా మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని అన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం వార్షిక బడ్జెట్ రూ.38 కోట్ల 35 లక్షలు కాగా, అందులో ఆదాయం రూ.24కోట్ల 69 లక్షలుగా తెలిపారు. దీంతో జనరల్ ఖర్చులకు గాను రూ.24కోట్ల 23లక్షల 77వేల అవుతుందని అంచాన వేశామని పాలకవర్గం తీర్మానించారు. అనంతరం నాలుగేండ్ల పదవీకాలం పూర్తి చేస్తున్న సందర్భంగా కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు.

## మద్యం షాపు వివాదం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: మద్యం షాపు భాగస్వామ్యం పేరుతో మోసం చేసిన వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన పి.శంతను అనే వ్యాపారికి నల్గొండ జిల్లాకు చెందిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన చిగురుపాటి కుటుంబరావు, నాగాయలంకకు చెందిన గుడివాక రామంజనేయులు అలియాస్ అంజిబాబు పరిచయమయ్యారు. గతేడాది సెప్టెంబర్‌లో మద్యం షాపుల టెండర్లలో కుటుంబరావు పేరుతో నల్గొండ జిల్లా నకిరేకల్‌లో షాపు లభించింది. ఈ షాపును కలిసి నిర్వహించేందుకు కుటుంబరావు, రామాంజనేయులుతో గతేడాది నవంబర్ 21న ఫిలింనగర్‌లో శంతను ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు రూ.40 లక్షలు చెల్లించడంతో పాటు నకిరేకల్‌లో ఎస్‌కే వైన్స్ పేరుతో మద్యం షాపు ఏర్పాటు చేశాడు. రూ.13 లక్షలు చెల్లించి స్టాక్ కొనుగోలు చేసి 20 రోజుల పాటు నడిపించాడు. బకాయి చెల్లించకపోవడంతో కుటుంబరావు ఎక్సైజ్ శాఖకు ఇవ్వాల్సిన పత్రాలను ఇవ్వలేదు. నెలరోజుల సమయం ఇస్తే బకాయి మొత్తాన్ని ఇస్తానని శంతను చెప్పినా వినకపోవడం, 20రోజుల తర్వాత షాపును అధికారులు మూసేశారు. డబ్బులు సిద్ధమైనా కుటుంబరావును సంప్రదించేందుకు ప్రయత్నించగా, అంగీకరించలేదు. దీంతో నేరుగా అధికారుల సమక్షంలో మద్యం షాపు తెరిపించి తన సిబ్బందితో నడిపిస్తున్నాడని, తనకు సుమారు రూ.53 లక్షలు నష్టం వచ్చిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఫౌష్టికాహారంతో నే ఆరోగ్యం : గవర్నర్ తమిళిసై

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 09: చిరుధాన్యాలతోనే ఫౌష్టికాహారం, అదీ దక్షిణ భారత్ నుంచే దేశమంతా చేరాల్సి ఉంటుందని, అందులో మనందరిదీ కీలక పాత్ర అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎమ్ఆర్) సంచాలకులు డా. సి.తారా సత్యవతి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తొమ్మిదో వ్యవస్థాపక వార్షికోత్సవ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దక్షిణ భారత్‌లో చిరుధాన్యాల సాగుకు అనుకూలమైన వాతావరణం ఉందని, గతంలో చిరుధాన్యాల దిగుబడి అధికంగా ఉన్నప్పుడు వాటికి తగిన ధరలు లేకపోవడం వల్లే, ఇతర వాణిజ్య పంటలకు రైతులు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇక్రిశాట్ నుంచి డా. జేడీఏ హుగ్స్, డా. ఎస్ఎల్ మెహత, నాబార్డ్ తెలంగాణ సీజీఎం సుశీలా చింతాల మాట్లాడుతూ చిరుధాన్యాలు దేశ వ్యాప్తంగా ప్రాధాన్యత సంచరించుకున్నాయన్నారు. ఆయా రంగాలో ప్రతిభ కనబర్చిన న్యూట్రీ హబ్ ప్రిన్సిపల్ సైంటిస్టు డా.దయాకర్ రావు, సీఈఓ దయాకర్ రావు, మహేశ్ కుమార్‌లకు ప్రతిభ పురస్కారం అందజేశారు.

తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, ఓబీసీ సమాఖ్య గౌరవ అధ్యక్షులు, రచయిత బీఎస్ రాములు రచించిన 'బీసీ నోట్' పుస్తకాన్ని శుక్రవారం అసెంబ్లీ చాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అఖిల భారత వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జాతీయ అధ్యక్షులు కె.కోటేశ్వర్ రావుతో కలిసి ఆవిష్కరించారు. *– ఖైరతాబాద్, ఫిబ్రవరి 9*

## ఆరు గ్యారెంటీల దరఖాస్తుల పరిశీలన

బండ్లగూడ, ఫిబ్రవరి 9: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు గ్యారంటీల దరఖాస్తులు పరిశీలన కొనసాగుతుంది. మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రజలకు ఆరు గ్యారెంటీలను వర్తింప చేసేందుకు తగిన చర్యలు చేపడుతుంది. ఈ మేరకు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర శుక్రవారం ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఆన్‌లైన్ దరఖాస్తును పార దర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, శానిటేషన్ మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

**ఉచిత విద్యుత్ కోసం ..**

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న గృహజ్యోతి పథకం నిమిత్తం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం వివరాలు సేకరిస్తున్నారు. టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది బస్తీల్లో పర్యటిస్తూ మీటర్ రీడింగ్‌తో పాటు గృహజ్యోతికి అవసరమైన పత్రాలను సేకరిస్తున్నారు. మీటర్ కలిగిన ఇంటికి సంబంధించి యజమాని ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్లను సేకరించడంతో పాటు అక్కడిక్కడే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఖైరతాబాద్ డివిజన్ రామకృష్ణనగర్ బస్తీలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి మీటర్ల వివరాలను, ఆధార్ కార్డులను సేకరించారు. స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఈ శిబిరాన్ని సందర్శించి అధికారులకు సూచనలు జారీ చేశారు.

**అర్హులైన వారికి గృహజ్యోతి వర్తింపచాలి**

హిమాయత్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరికి గృహజ్యోతి పథకాన్ని వర్తింప జేయాలని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నేత జి.రామన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డివిజన్‌లో గృహజ్యోతి పథకానికి సంబంధించిన డాక్యుమెంట్ పత్రాలను విద్యుత్ అధికారులు పరిశీలించారు. పలు సెంటర్లను రామన్ గౌడ్ సందర్శించి లబ్ధిదారుల ఎంపికపై విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకం అమలు కంటే ముందుగా అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. పేదలు (200యూనిట్ల)లోపు ఉచిత కరెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు లోనయితే జీవితం అంధకారమే

**మోటివేషనల్ స్పీకర్ వేణు కల్యాణ్**

ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ ఇస్తున్న వేణు కల్యాణ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: ఫిలింనగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో వారిలోని నైపుణ్యాలను బయటకు తీసే ఉద్దేశంతో ఫైవ్ ఫింగర్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వేణు కల్యాణ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు కల్యాణ్ మాట్లాడుతూ, ఇటీవల సెల్‌ఫోన్ అనేది విద్యార్థులకు వ్యసనంగా మారిందని, సెల్‌ఫోన్ ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తోందన్నారు. విద్యార్థి దశలో చెడు అలవాట్లకు లోనయితే జీవితం మొత్తం అంధకారమవుతుందని, తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను చదివిస్తుంటారని, వారి ఆశలను తీర్చాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు. ఈ సందర్భంగా ఫైవ్ ఫింగర్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పరీక్షల కిట్స్‌ను అందజేశారు.

## నాణ్యమైన విద్యకు యూజీసీ గుర్తింపు

నాణ్యమైన విద్యనందించినందుకు తమకు యుజీసీ గుర్తింపు వచ్చిందని పల్లవి ఇంజినీరింగ్ కాలేజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ గత 30 ఏండ్లుగా వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దామన్నారు. విద్యకు చేస్తున్న కృషికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీ రాజు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సుమేధా రమేశ్, ఏవో శ్రీధర్ పాల్గొన్నారు. *– ఖైరతాబాద్, ఫిబ్రవరి 9*

## అంగన్ వాడీల హామీలు అమలు చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు, చిత్రంలో తదితరులు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, జాతీయ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, ఉమెన్ ఫోరం అధ్యక్షురాలు పి.ప్రేం పావని, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి, డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్ రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు సామాజిక భద్రతతో పాటు టీచర్లకు రూ.18,000 ల వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సాయిశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి, నాయకులు టి.సమ్మ య్య, ప్రసాద్, సి.హెచ్.సీతామహాలక్ష్మి, మణి, సుమతమ్మ, క్రిష్ణాకుమారి, ప్యారీజాన్, రజిత, మమత, శోభ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. కాటేదాన్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కమిటీ అధ్యక్షులు పల్లె శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాటేదాన్ ఏరియాలో భవన నిర్మాణ కార్మికులు చాలా మంది ఉన్నారన్నారు. కార్మికులంతా భవన నిర్మాణ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలన్నారు. అనేక మంది కార్మికులు భవనాలపై నుంచి పడి గాయాలపాలవుతున్నారని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కార్డులున్న వారికి ఎన్నో లాభాలు ఉంటాయన్నారు. వారికి ఆసుపత్రి ఖర్చులు భరించడంతో పాటు సౌకర్యాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కురుమయ్య, కార్యదర్శి ఎస్.రామోహన్‌రావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు అందజేస్తున్న చంద్రమోహన్ తదితరులు

## దాడిలో భార్య, ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: కుటుంబ కలహాల్లో భాగంగా తనను ఇంట్లోంచి వెళ్ల గొట్టేందుకు ప్రయత్నించడంతో పాటు దాడికి పాల్పడిన భార్యతో బావమరుదుల మీద చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్ నం.13లోని అంబేద్కర్‌నగర్ బస్తీకి చెందిన గుండప్ప(47) కూలీ పనులు చేస్తుంటాడు. భార్య లక్ష్మితో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దాంతో ఇంట్లోంచి వెళ్లిపోవాలని లక్ష్మి చెప్పడంతో సమీపంలోనే ఉంటున్న తన తమ్ముళ్లు గోవింద్, బాలాజీలను పిలిచింది. భార్యాభర్తలు గొడవ పడటంతో గోవింద్, బాలాజీలు గుండప్పపై దాడి చేశారు. భార్య లక్ష్మి వేడివేడి స్పూన్‌తో ముఖంపై వాత పెట్టింది.

## రాము నిందితులను కఠినంగా శిక్షించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 9: నగరంలోని ఎల్ఎన్‌నగర్‌లో రియల్టర్ సింగోటం రాము ముదిరాజ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేందర్ శివయ్య ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిమాయత్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ఫౌండేషన్ పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న రాముపై దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజకీయంగా ఎదుగుతున్న ముదిరాజు కులస్తులను హత్యా రాజకీయాలతో అడ్డుకోలేరని, ప్రభుత్వం స్పందించి నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాము కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

## విద్యార్థుల సేవకు ముందుకు రావాలి

- వీ ఆర్ ఫర్ యూ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

మణికొండ, ఫిబ్రవరి 9: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతను అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వీ ఆర్ ఫర్ యూ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 206 మంది విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడాన అల్పాహారాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు అందె లక్ష్మణ్ రావు, నరేష్, సత్యనారాయణలు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇప్పుడు ఎంత కష్టపడితే మున్ముందు అంత సుఖపడతారన్నారు. మన లక్ష్యసాధన కోసం అహర్నిశలు కష్టపడి చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేదలైన విద్యార్థులే ఎక్కువ శాతం విద్యాబుద్ధులు నేర్చుకుంటారన్నారు. మొదటి విడతగా నాలుగు రోజుల పాటు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11 రకాల పౌష్టికాహారాల మిశ్రమల ధాన్యాలతో తయారు చేసిన అల్పాహారాన్ని సమకూరుస్తున్నామన్నారు. అలాగే గోల్డెన్ ఏరియల్ అపార్ట్‌మెంట్ వారి సహకారంతో బ్రెడ్, బటర్ అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. మార్చి 15వ తేదీ వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు మంచి పోషక పదార్థాలతో కూడిన సాయంత్రపు తినుబండారాలను అందించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ నాయక్, ట్రస్ట్ కన్వీనర్ నిర్మల్ చంద్ గోలేచ, కోశాధికారి దివిలీ కక్కడ్ పాల్గొన్నారు.

## బంగారు నగలు, నగదు చోరీ

వెంగళరావునగర్, ఫిబ్రవరి 9: బంగారు నగలు, నగదు చోరీకి గురైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని వెస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం, వెస్ట్ శ్రీనివాస్ నగర్‌లో నివాసముంటున్న పన్నూరి నిర్మల (58) గత సంవత్సరం డిసెంబర్ 16న స్నానం చేయడానికి వెళ్లే ముందు తన ఒంటి పై ఉండే 3.5 తులాల బంగారు గొలుసు, ఒక వజ్రపు ఉంగరం, 25 గ్రాముల రెండు గాజులతో పాటు రూ.40,000ల నగదును తన బ్యాగులో పెట్టి స్నానానికి వెళ్లారు. బయటకు వచ్చి చూసేసరికి బ్యాగు కనిపించలేదు. చోరీకి గురైందని తెలుసుకుని మధురానగర్ పోలీసు స్టేషన్‌లో బాధితురాలు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పారిశుధ్య కార్మికురాలి ఆత్మహత్య

యాదమ్మ(ఫైల్)

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: ఆర్థిక సమస్యలతో పాటు మానసికంగా ఇబ్బంది పడుతున్న జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వెంకటగిరిలో ఉంటున్న నీరడు యాదమ్మ(58) జీహెచ్ఎంసీ స్వీపర్. ఆమె భర్త ఎల్లేశ్ పదేండ్ల క్రితం చనిపోగా, పెద్ద కొడుకు ఏడాది క్రితం మృతి చెందాడు. చిన్న కొడుకు హోటల్‌లో పని చేస్తుంటాడు. కాగా, పెద్ద కొడుకు చనిపోయినప్పటి నుంచి ఆర్థిక సమస్యలతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది.

**జీతమివ్వని యజమానిపై ..**

వెంగళరావునగర్, ఫిబ్రవరి 9: జీతం డబ్బు చెల్లించాలని కోరిన ఉద్యోగిపై శారదా శారీస్ యజమాని దాడికి పాల్పడ్డాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా కొట్టిన వ్యవహారంపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సాయినాథ్ రెడ్డి కథనం మేరకు, ప్రకాశం జిల్లా గంగపాలేనికి చెందిన పాలంకి ప్రభాకర్(46) హాస్టల్‌లో ఉంటూ ఆ ప్రాంతంలోని శారదా శారీస్ దుకాణంలో ఆరేళ్ల నుంచి మేనేజర్‌గా పని చేస్తున్నారు. నెలకు రూ.40 వేలు జీతం. సంక్రాంతికి 5 రోజులు సెలవు పెట్టాడు. ఈ నెల 5న దుకాణం యజమాని మారుతీరావు ఆ 5 రోజుల జీతం ఆపుకొని రూ.34,800 ఇచ్చాడు. ఈ విషయమై యజమానిని ప్రశ్నించగా దుర్భాషలాడుతూ దాడి చేశాడు.

## అర్హత గల ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

ఓటరు నమోదు కేంద్రా